సంక్షేమం ప్రతి ఇంటికి అందింది

– గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



లబ్ధిదారుకు పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



ఎంపీపీ ఎన్నిక అనంతరం ఎంపీటీసీ సభ్యులతో ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

గాలివీడు : సీఎం జగన్ అందిస్తున్న సంక్షేమం ప్రతి ఇంటికి అందిందని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. సీసీపల్లె గ్రామంలో గురువారం శ్రీకాంత్ రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏం తల్లి నవరత్నాలు అందాయా ? ఇల్లు వచ్చిందా, పెన్షన్ 1వ తేదీనే అందుతోందా.. లబ్ధిదారులను ఆప్యాయంగా పలుకరిస్తూ, పథకాల గురించి వారి నుంచి స్పందన వింటూ ప్రతి గడపకు తిరిగారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించారు. ఆయా కుటుంబాలు పొందిన సంక్షేమ వివరాల బుక్‌లెట్‌ను అందించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపడానికి సంక్షేమ పథకాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకొచ్చారన్నారు. దేశ చరిత్రలోనే ఇంత వరకు ఏ ముఖ్యమంత్రి ఇన్ని పథకాలు అందించలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో తిరిగి జగనన్నను గెలిపించుకుంటేనే ఈ పథకాలు కొనసాగుతాయని ప్రజలకు ఆయన తెలియజేశారు. శ్రీకాంత్‌రెడ్డి దృష్టికి తెచ్చిన సమస్యలను అక్కడిక్కడే పరిష్కరిస్తూ, కొన్ని సమస్యలను అధికారులు త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ జల్లా పద్మావతమ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథరెడ్డి, వైస్ ఎంపీపీ యదుభూషన్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నాగభూషన్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు ఖాదర్‌మోద్దీన్, ఎంపీటీసీలు ప్రభావతమ్మ, చంద్రప్రకాష్‌రెడ్డి, చిన్నపరెడ్డి, సర్పంచ్‌లు చెన్నకేశవరెడ్డి, ఉమాపతిరెడ్డి, కమలమ్మ, ఉమ, జానకమ్మ, సచివాలయం కన్వీనర్ రామేశ్వర్‌రెడ్డి, బయారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు భానుమూర్తిరెడ్డి, క్రిష్టారెడ్డి, బీసీ నాయకులు చెంద్రాయుడు, వాటర్ షెడ్ చైర్మన్ మస్తాన్, రమణారెడ్డి, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించండి

విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరిస్తూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్న పిల్లలకు విద్యను, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంతోపాటు ఇతర సేవలను అందించాలని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు. లక్కిరెడ్డిపల్లె ఐసీడీఎస్ పరిధిలో ఖాళీలుగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు ఎంపికైన 6 మంది అభ్యర్థులకు గురువారం గాలివీడు ఎంపీడీఓ కార్యాలయంలో నియామక పత్రాలను అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంగన్‌వాడీలలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ప్రీ ప్రైమరీ విద్యను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. అంగన్‌వాడీల వ్యవస్థ గ్రామాల్లో చాలా కీలకమన్నారు.

ఎంపీపీ ప్రమాణ స్వీకారం

గాలివీడు ఎంపీపీగా జల్లా పద్మావతమ్మ ఎన్నికయ్యారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి హాజరై, ఎంపీపీ పద్మావతమ్మకు శుభాకాంక్షలు తెలియజేశారు. వైస్ ఎంపీపీ యదుభూషణ్‌రెడ్డి ఉన్నారు.

వలంటీర్లు గొప్ప సేవకులు

వలంటీర్లు గొప్ప సేవకులు అని రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఎస్‌కె కల్యాణ మండపంలో వలంటీర్లకు వందనం కార్యక్రమంలో శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడలేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వలంటీర్ల వ్యవస్థను తీసుకువచ్చి సంక్షేమ పథకాలకు నేరుగా అందించే విధంగా కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రతి వలంటీరు సైనికుల్లా పని చేసి ప్రభుత్వానికి మంచి పేరుకు తీసుకువచ్చి తిరిగి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేయాలని సూచించారు. ఎన్నికల మేనిఫెస్టోను ఆన్‌లైన్‌లోనే లేకుండా చేసిన చరిత్ర చంద్రబాబు నాయుడుదని ఈ విషయాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ జల్లా పద్మావతమ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథరెడ్డి, వైస్ ఎంపీపీ మిట్టపల్లె యదుభూషణ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆవుల నాగభూషణ్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రమేష్ రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు వలంటీర్లు పాల్గొన్నారు.

గృహ ప్రవేశ కార్యక్రమానికి..

లక్కిరెడ్డిపల్లె : కస్తూరిరాజుగారిపల్లె గ్రామం, గురవయ్యగారిపల్లెకు చెందిన కుర్నూతల గురుమూర్తి నూతన గృహ ప్రవేశ కార్యక్రమానికి అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి హాజరై శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆయనతోపాటు ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

11న ప్రవేశ పరీక్ష

చిన్నమండెం : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి ఈ నెల 11న ప్రవేశ పరీక్షను నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ రమేష్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంద మందికి గాను 183 మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకున్నారన్నారు. వీరికి ఆదివారం ఉదయం 10 గంటల నుంచి పరీక్ష ఉంటుందన్నారు. ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలియజేశారు.

నేటి నుంచి మారెమ్మ జాతర



ముస్తాబైన మారెమ్మ ఆలయం

నందలూరు(రాజంపేట) : నాగిరెడ్డిపల్లె శివారులో వెలసిన మారెమ్మ జాతరను ఈ నెల 9 నుంచి 12 వరకు నిర్వహించనున్నారు. ఈ మేరకు గురువారం జాతర ఏర్పాట్లకు ఆలయాన్ని సిద్ధం చేశారు. నాలుగు రోజులపాటు పొంగళ్ల మహోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు. 9న మహాగణపతి పూజలు చేసి ధ్వజారోహణ కార్యక్రమం చేపట్టనున్నారు. మహాగణపతి హోమం, మారెమ్మ తల్లి మూలమంత్ర హోమాలు నిర్వహించనున్నారు. మారెమ్మ గుడి సమీపంలోని గంగమ్మకు 101 టెంకాయలతో పూజ కార్యక్రమాలుంటాయి. శనివారం, సోమవారం అమ్మవారికి ప్రత్యేకపూజలు చేయనున్నారు.

బాధ్యతల స్వీకరణ

పుల్లంపేట : పుల్లంపేట ఎంపీడీఓగా రఘురాం గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో వల్లూరు మండలంలో ఏఓగా పనిచేస్తున్న రఘురాం పదోన్నతి మీద పుల్లంపేట ఎంపీడీఓగా వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తానని, అధికారులతో కలిసికట్టుగా పనిచేసి మండల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రకాశం, ఏఓ హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

చిట్వేలి తహసీల్దార్‌గా శిరీషా..

చిట్వేలి : మండల తహసీల్దార్‌గా శిరీషా గురువారం బాధ్యతలు చేపట్టారు. రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏఓగా విధులు నిర్వహిస్తున్న శిరీషా చిట్వేలికు బదిలీపై వచ్చారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేస్తున్న మురళీకృష్ణ ఏఓగా బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా శిరీషా వీఆర్‌ఓల సమావేశం నిర్వహించి బాధ్యతాయుతంగా విధులను నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ శేషంరాజు, వీఆర్‌ఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

వివాహానికి హాజరైన జెడ్పీ చైర్మన్ ఆకేపాటి

సిద్దవటం : మండలంలోని వంతాటిపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ముక్కర చిన్న వెంకటసుబ్బారెడ్డి కుమారుడు రామ్మోహన్‌రెడ్డి వివాహానికి గురువారం జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి హాజరై, నూతన వధూవరులను ఆశీర్వదించారు.

కొత్తపురమ్మకు పూజలు



సంబేపల్లె : దుద్యాల గ్రామ శివారుల్లో వెలసిన కొత్తపురమ్మకు గురువారం భక్తులు విశేష పూజలు జరిపారు. ఉదయం నుంచే అమ్మవారి మూలవిరాట్‌ను అలంకరించి ప్రత్యేక పూజ లు, అభిషేకాలు, అర్చనలు చేశారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు.

ఘనంగా సీతారాముల కల్యాణం



పూజల్లో పాల్గొన్న సాయికిషోర్‌రెడ్డి, నాయకులు

ఓబులవారిపల్లె : మండల పరిధిలోని యల్లాయపల్లి గ్రామంలో సీతారాముల ఆలయ ప్రారంభోత్సవం, కల్యాణాన్ని గురువారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన గ్రామస్తులు అనంతరం కల్యాణంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జరుగు నారాయణ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పసుపులేటి సుబ్బరాయుడు, పి.శ్రీనివాసులు, శంకరయ్య, వెంకటయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపు సరికాదు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : విద్యుత్ చార్జీలపెంపును తక్షణమే ఉపసంహరించుకోవాలని ఏపీ కాంగ్రెస్ కమిటీ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు పటాన్ మహమ్మద్ అలీ ఖాన్ పేర్కొన్నారు. గురువారం నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ప్రజలను విద్యుత్ చార్జీలపై అదనపు రుసుముల పెంపు పేరుతో నిరంతరంగా దోపిడీ చేస్తున్నాయని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వం స్లాబుల విధానాన్ని పూర్తిగా తొలగించి ఆస్థానంలో నాన్ స్లాబ్ విధానాన్ని ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు

రైతులకు విరివిగా రుణాలు



రైతులకు రుణాలు అందజేస్తున్న దృశ్యం

లక్కిరెడ్డిపల్లె : రైతులకు విరివిగా రుణాలు అందజేస్తామని మద్దిరేవుల సింగిల్ విండో ప్రెసిడెంట్ సిద్ధక రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. సంఘంలో దీర్ఘకాలిక రుణాలు కింద రైతులకు రూ. 23,67,000లను చెక్కుల ద్వారా గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మా సంఘంలో రైతులకు దీర్ఘకాలిక రుణాలు, స్వల్పకాలిక రుణాలు అందజేస్తున్నామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని రుణాలు పొందాలన్నారు. కార్యక్రమంలో రైతులు, సంఘం సీఈఓ సివి సుబ్బారెడ్డి, సంఘం సిబ్బంది పాల్గొన్నారు.

వినాయకుడికి సంకటహర పూజలు



రాయచోటి టౌన్ : వీరభద్రస్వామి ఆలయంలో కొలువైన విఘ్నేశ్వరుడికి సంకటహర పూజలు నిర్వహించారు. గురువారం రాత్రి స్వామి వారికి సంకటహర పూజలలో భాగంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని గరిక, పూలతో అలంకరించి భక్తుల దర్శన ఏర్పాట్లు చేశారు. తీర్థప్రసాదాలు అందజేశారు.

లండన్‌లో పుట్టినరోజు జరుపుకున్న కొరముట్ల



కేక్ కట్ చేస్తున్న ప్రభుత్వవిప్ కొరముట్ల

రైల్వేకోడూరు : లండన్‌లో ప్రవాసాంధ్రుల సమక్షంలో గురువారం ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పుట్టినరోజును జరుపుకున్నారు. ఎమ్మెల్యే కొరముట్ల పుట్టినరోజు సందర్భంగా ఎన్‌ఆర్‌ఐలు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ ఎప్పుడు లండన్‌కు వచ్చినా అభిమానులు బ్రహ్మరథం పట్టడం సంతోషంగా ఉందన్నారు. వారి అభిమానం, అప్యాయతను ఎప్పటికీ మర్చిపోలేనని చెప్పారు. కార్యక్రమంలో ఆకేపాటి సుబ్బారెడ్డి, పుత్తన మల్లికార్జునరెడ్డి, ముక్కా పూర్ణారెడ్డి, చంద్రారెడ్డి, క్రిష్టారెడ్డి, కొమ్మూరు మస్తాన్, కొమ్మూరు నాగేంద్ర, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీసీ, కులసంఘాల నేతలు

రాయచోటి అర్బన్ : రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు దామాషా ప్రకారం బీసీలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని రాష్ట్ర బీసీ చైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బి.సి.రమణ అన్నారు. బుధవారం పట్టణంలోని కడప మార్గంలో ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి ఆయన బీసీ నేతలతో కలసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా బీసీలను రాజకీయంగా చైతన్య పరచేందుకు అన్ని జిల్లా కేంద్రాల్లో కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. అన్నమయ్య జిల్లా నుంచే ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం నేతలు డాక్టర్ లక్ష్మిప్రసాద్, రామ క్రిష్ణ యాదవ్, కె.వి.రమణ, వడ్డెర సంఘం వెంకటేష్, రజక సంఘం శ్రీనివాసులు, రమేష్, కుమ్మర సంఘం నేత సుధాకర్, మేధావుల ఫోరం నేత జీవానందం, ఆర్టీసీ ఉద్యోగుల సంఘం నేత రామాంజులు, ప్రొద్దుటూరు నాగేశ్వరరావు, అడ్వకేట్లు నాగముని, నాగార్జున, ఎన్‌ఆర్‌ఐలు వెంకటసుబ్బయ్య, రామక్రిష్ణయాదవ్, గోపాల్, వేముల చిరంజీవి, అమరనాథ్, వెంకటస్వామి, వెంకటేష్‌లు పాల్గొన్నారు.


ఫీజుల దోపిడీపై విచారణ చేయాలి

రాయచోటి అర్బన్ : కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో జరుగుతున్న ఫీజుల దోపిడీపై వెంటనే విచారణ జరిపించాలని డీఈఓ పురుషోత్తంను ఏబీవీపీ అన్నమయ్య జిల్లా కన్వీనర్ జె.పి.నాగిరెడ్డి కోరారు. జిల్లాలోని కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థుల ముందస్తు అడ్మిషన్ల పేరిట వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారంటూ తెలిపారు. ఈ టెక్నో, ఈ స్మార్ట్, ఒలంపియాడ్ తదితర పేర్లతో విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్నారన్నారు. అడ్మిషన్‌లు చేస్తేనే జీతాలు లేదంటే లేదంటూ సదరు పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులను యాజమాన్యం వేధింపులకు గురిచేస్తోందంటూ ఆరోపించారు. ఈ విషయంపై డీఈఓ ప్రత్యేక కమిటీతో విచారణ చేయించి అందుకు బాధ్యులైన పాఠశాలల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆయన వెంట పట్టణ ఏబీవీపీ కార్యదర్శి నందరాజ్, నేతలు ప్రశాంత్, రాంప్రసాద్, హరిప్రసాద్, నరేష్, శివశంకర్‌లు పాల్గొన్నారు.

సహాయ సహకారాలు అందిస్తాం

పుల్లంపేట : రైల్వేకోడూరు నియోజకవర్గ వ్యాప్తంగా సోషల్ మీడియా కన్వీనర్, మండల కన్వీనర్లు, కో – కన్వీనర్లకు తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని మండల వైఎస్సార్‌సీపీ యువనాయకుడు డా.ముద్దా రామసుబ్బారెడ్డి అన్నారు. గురువారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోషల్ మీడియా కన్వీనర్లు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. 2024లో మరలా జగనన్న ముఖ్యమంత్రిగా అధికారం చేపడతారన్నారు. కావున ప్రతి ఒక్కరూ జగనన్న ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. సోషల్ మీడియా ద్వారా ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ పోలి మహేంద్రరెడ్డి, పుల్లంపేట సోషల్ మీడియా కన్వీనర్ వెంకటేష్, శివకుమార్, హరి, వైఎస్ మధు, బి.సుబ్రమణ్యం, నాగప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరుబయట మద్యం తాగితే జైలుకే



వాహనదారులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ చంద్రమోహన్

వీరబల్లి (రాయచోటి టౌన్) : ఆరుబయట మద్యం తాగితే జైలుకు పంపుతామని వీరబల్లె ఎస్‌ఐ చంద్రమోహన్ మద్యం ప్రియులను హెచ్చరించారు. గురువారం సాయంత్రం మండల కేంద్రంలోని సర్కిల్ వద్ద వాహనాలను తనిఖీ చేశారు. వాహనదారుల రికార్డులను పరిశీలించారు. అన్ని రకాల రికార్డులు సక్రమంగా ఉంచుకోవాలని సూచించారు. రికార్డులు లేకుండా వాహనాలను నడిపితే కేసులు పెట్టి జైలుకు పంపుతామని హెచ్చరించారు. ఆరుబయట ప్రదేశాలలో మద్యం తాగితే ఉపేక్షించమని, ఆరుబయట ప్రజల సమూహంలో పొగతాగడం నేరమేనని హెచ్చరించారు.

వేణుగోపాలస్వామికి పాన్పు సేవ



పాన్పు సేవలో వేణుగోపాల స్వామి

పెనగలూరు: మండల కేంద్రంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం రాత్రి పవళింపు సేవ ఘనంగా జరిగింది. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఊయలలను సుందరంగా అలంకరించారు. రుక్మిణీ, వేణుగోపాల స్వామి ఉత్సవ విగ్రహాలను పాన్పుపై ఉంచి వేద పండితులు మంత్రోచ్చారణలతో పాన్పు సేవ చేశారు. అంతకుముందు స్వామి వారిని పురవీధులలో ఊరేగించారు. భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పురోహితుడు చెంచు సుబ్బనరసయ్య, ఆలయ చైర్మన్ సుబ్బారెడ్డిలు పాల్గొన్నారు.

ప్రోత్సాహక నగదు అందజేత



విద్యార్థులకు నగదును అందించిన చిన్నరెడ్డప్ప

చిన్నమండెం : పది ఫలితాల్లో పాస్ అయిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు గురువారం అందించారు. మండల పరిధిలోని కొత్తపల్లె పంచాయతీ బండకాడ కురవపల్లెకు చెందిన చిన్నరెడ్డప్ప తన కుమారుడు గంధోళ్ల రమేష్ జ్ఞాపకార్థం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో 5 మంది విద్యార్థులు పరీక్షలు రాసి ఉత్తీర్ణులు కాగా ఒక్కొక్కరికి రూ.4016లను అందించారు. కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, దాత కుటుంబీకులు పాల్గొన్నారు.

చెర్లోపల్లిలో గంగమ్మ జాతర



గుడి చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న పందేరపు బండి

చిట్వేలి : మండల పరిధిలోని చెర్లోపల్లి గ్రామంలో గురువారం గంగమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. బుధవారం రాత్రి ప్రారంభమైన జాతర గురువారం రాత్రితో ప్రశాంతంగా ముగిసింది. గురువారం తెల్లవారుజామున గుడికి బయలుదేరిన గంగమ్మకు అడుగడుగునా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. గుడికి చేరిన అమ్మవారికి బలిదానాలు నిర్వహించిన తరువాత గ్రామస్తులు గ్రామ పొలిమేర చుట్టూ బలిని పట్టుకొని తిరిగారు. అనంతరం సాయంత్రం పందేరపు బండ్లు గుడి చుట్టూ ప్రదక్షిణలు చేశాయి. ఎస్‌ఐ సుభాష్ చంద్రబోస్, సిబ్బంది పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

వేసవి శిబిరం

చిన్నమండెం : మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయంలో వేసవి శిబిరంలో భాగంగా విద్యార్థులకు విజ్ఞానంతో పాటు వినోదం, ఆటలు వంటి కార్యక్రమాలు నిర్వహించినట్లు గ్రంథాలయ అధికారి ఆంజనేయులురెడ్డి తెలిపారు. ఈ నెల 11వ తేదీ వరకు వేసవి శిబిరాన్ని గ్రంథాలయంలో నిర్వహిస్తామన్నారు. పిల్లలకు ఆటలు, పాటలు, క్విజ్ పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేసినట్లు తెలిపారు.

నివాళి

ఓబులవారిపల్లె : గాదెల గ్రామంలో గురువారం అనారోగ్యంతో మృతి చెందిన సోమల వేణు(25) మృతదేహానికి ఏపీటీడీసీ డైరెక్టర్ వి.సాయికిషోర్ రెడ్డి నాయకులతో కలిసి నివాళులర్పించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయనతోపాటు మాజీ ఎంపీపీ రామకృష్ణయ్య, సీనియర్ నాయకులు కొమ్మూరు భాస్కర్ రెడ్డి, సర్పంచ్ జరుగు నారాయణరెడ్డి నివాళి అర్పించారు.

జెడ్పీహెచ్ఎస్ ప్రిన్సిపాల్‌గా సుధారాణి

రామాపురం : మండలంలోని హసనాపురం పంచాయతీ కొండావాండ్లపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా సుధారాణి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న షేక్ షామీర్ బాషా రాయచోటిలోని ఉర్దూ మార్కెట్ స్కూలు(జిల్లా పరిషత్ హైస్కూల్)కు బదిలీపై వెళ్లినట్లు ఆమె తెలిపారు.

జీపీఎస్‌తో భరోసా

పీలేరు రూరల్ : ఆర్టీసీ ఉద్యోగులకు జీపీఎస్ ప్రయోజనం కల్పించడం ద్వారా సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి భరోసా ఇచ్చారని ఏపీఆర్టీసీ రాష్ట్ర డైరెక్టర్ ఎ.రాజారెడ్డి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులు ముఖ్యమంత్రికి రుణపడి ఉంటారన్నారు.

వైభవంగా గంగమ్మ జాతర



మొక్కులు చెల్లించుకుంటున్న మహిళలు



పూజల్లో పాల్గొన్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి

పెనగలూరు : నల్లపరెడ్డిపల్లెలో 31 సంవత్సరాలు తరువాత గంగమ్మ జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించారు. బుధవారం రాత్రి గంగమ్మకు పందిరివేసి విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకువచ్చి ఆలయంలో ప్రతిష్టించారు. అనంతరం ఆసాదులచే ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఉదయం జల్లికట్ట నుంచి పోతులూరయ్యను ఊరేగింపుగా తీసుకువస్తుండగా ప్రతి ఇంటివద్ద గంగమ్మకు ముద్దపెట్టుకొని తమ మొక్కులు తీర్చుకున్నారు.

30 సంవత్సరాల తరువాత జాతరను నిర్వహిస్తుండటంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ప్రతి ఇంటివద్ద షామియానా వేసి బంధువులు, మిత్రులను పిలుచుకోవడంతో గ్రామమంతా కిక్కిరిసిపోయింది. జాతర నిర్వహిస్తుండగా రోడ్లు భక్తులతో కిటకిటలాడింది. ప్రజాప్రతినిధులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. రాష్ట్ర వ్యవసాయ సలహామండలి సభ్యుడు తిరుపాల్‌రెడ్డి, రాజంపేట మేయర్ పోలా శ్రీనివాసులు రెడ్డిలతోపాటు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. సర్పంచ్ శ్రీనివాసులు రెడ్డి, మాజీ సర్పంచ్ సానారెడ్డి, వెంకటరెడ్డిలతోపాటు గ్రామంలోని ప్రతి కుటుంబంలో ఇంటి ముంగిట అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

పూజల్లో పాల్గొన్న ఆకేపాటి, అజయ్‌రెడ్డిలు

జగనన్న మరలా ముఖ్యమంత్రి కావాలని గంగమ్మకు మొక్కుకున్నామని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డిలు అన్నారు. జాతర సందర్భంగా నల్లపరెడ్డిపల్లెకు వచ్చిన వీరికి ప్రజలు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్ సిపి నాయకులు లేబాకు శ్రీనివాసులు రెడ్డి, బండి సానారెడ్డి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ లేబాకు శ్రీనివాసులు రెడ్డి, మండల మాజీ వైస్ ప్రెసిడెంట్ వెంకటరెడ్డి, వైకాపా యువనాయకులు లేబాకు వెంకటరెడ్డి, భాస్కర్ రెడ్డి, సుబ్బారెడ్డి, రెడ్డయ్య రెడ్డి, కె.నరసింహారెడ్డి, సుబ్బిరెడ్డిలతోపాటు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నారా లోకేష్‌ది టైం పాస్ యాత్ర



శ్రీనివాసులరెడ్డి, వైస్ ఎంపీపీ

సిద్దవటం : టీడీపీ నాయకుడు నారా లోకేష్ చేస్తున్నది పాదయాత్ర కాదని, పిల్లియాత్ర అని వైస్ ఎంపీపీ నారపురెడ్డి శ్రీనివాసులరెడ్డి విమర్శించారు. ఈ సందర్భంగా గురువారం ఆయన సిద్దవటంలో విలేకరులతో మాట్లాడుతూ వైఎస్ఆర్ సీపీ అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు మొక్కవోని దీక్షతో ఉదయం నుంచి రాత్రి వరకు పాదయాత్ర చేపట్టి ప్రజా సమస్యలను తెలుసుకొని అధికారంలోకి రాగానే వాటిని నెరవేర్చారన్నారు. అయితే ప్రస్తుతం నారా లోకేష్ పాదయాత్ర పేరుతో పిల్లి అడుగులు వేస్తున్నారన్నారు. ఆయన పాదయాత్రకే తలవంపులు తెస్తున్నారని ఆరోపించారు. సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభించి 3 లేదా 4 కిలోమీటర్లు నడుస్తూ పాదయాత్రకే మచ్చతెస్తున్నారని దుయ్యబట్టారు. సమస్యలు తెలుసుకోవడానికి కాకుండా టైం పాస్ కోసం చేస్తున్నట్టు అభిప్రాయపడ్డారు. కడపలోనే మూడు రోజులు పాద యాత్ర చేశాడంటే ఆయన పాదయాత్ర ఏవిధంగా చేస్తున్నారో అర్థమవుతుందన్నారు. లోకేష్ పాదయాత్ర వెల వెల పోతుండటంతో జనసమీకరణ కోసం టీడీపీ శ్రేణులు పాట్లు పడుతున్నారని తెలియజేశారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించండి

రాయచోటి అర్బన్ : సంవత్సరాలుగా పరిష్కారానికి నోచుకోని భవన నిర్మాణ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కన్వీనర్ మావులూరి విశ్వనాథ్ డిమాండ్ చేశారు. బుధవారం సాయంత్రం ఆయన భవన నిర్మాణ కార్మికులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2018 నుంచి ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లను వెంటనే విడుదల చేయాలన్నారు. కార్మికుల సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేయకుండా మరింతగా బలోపేతం చేసేదిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సుప్రీంకోర్టు తీర్పును గౌరవించి సంక్షేమబోర్డు నిధులను కేవలం కార్మికుల సంక్షేమం కోసం వినియోగించాలంటూ హితవు పలికారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నేతలు మదనమోహన్, చలపతి, రమణతో పాటు పలువురు భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో భూసారం వృద్ధి



నవధాన్యాల కిట్లను పంపిణీ చేస్తున్న శ్రీదేవి

రామాపురం : నవధాన్యాల సాగుతో భూమిలో భూసారం పెరుగుతుందని ఉత్తమ మహిళా రైతు సూరం శ్రీదేవి అన్నారు. గురువారం మండలంలోని రాచపల్లి గ్రామ పంచాయతీ బాలిరెడ్డిగారిపల్లె రైతులకు నవధాన్యాల కిట్లను అందించారు. మాట్లాడుతూ నవధాన్యాలను నాలుగు విధానాల ద్వారా విత్తుకోవచ్చునని తెలిపారు. నవధాన్యాలు సాగు చేసిన పంట దిగుబడి తరువాత పశువులకు మేతగా ఇవ్వడంతో పాలలో వెన్నశాతం పెరుగుతుందని, పశువుల మేతకు సరిపోయాక మిగిలిన వేరు వ్యవస్థను భూమిలో కలియదున్నడంతో భూసారం పెరుగుతుందన్నారు. వరిలో నవధాన్యాలను పచ్చరొట్ట ఎరువుగా భూమిలో సాగు చేస్తే వరి మొక్కలకు కావాల్సిన పోషకాలు అందుతాయన్నారు.

ఖరీఫ్‌కు మద్దతు ధర ప్రకటించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : కేంద్ర ప్రభుత్వం 2023 ఖరీఫ్ పంటలకు కనీస మద్దతు ధర విషయంగా రైతులపై కనికరం చూపకుండా కర్కశంగా వ్యవహరించడం దారుణమని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలో గోధుమ తరువాత అత్యధికంగా పండించే, వినియోగించే పంట వరికి క్వింటాల్‌పై 143 రూపాయలు పెంచడాన్ని దుర్మార్గమన్నారు.